కౌలురైతుల పేరున పంట నమోదు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్‌లో ఇ-పంట నమోదులో రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులను పట్టించుకోవడం లేదని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూ యజమాని సంతకం పెడితేనే కౌలు కార్డులివ్వాలని నిబంధనలు పెట్టడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వారి పేరున కనీసం పంట నమోదు కూడా చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిసిఎల్ఎ కమిషనర్ నుంచి ఇచ్చిన సర్క్యులర్‌లో కౌలురైతుల పేరున పంట నమోదు చేయాలని స్పష్టంగా ఉన్నా జిల్లా అధికారులు పట్టిచుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు, రైతులంతా పంట నమోదు చేయించుకోవాలని, ఊదర గొట్టడమే గానీ కౌలు రైతులైతే వారి పేరునే పంట నమోదు చేయాలని ఒక్క సమావేశంలో కూడా చెప్పడం లేదని విమర్శించారు. తక్షణం వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేరున పంట నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అపరిశుభ్రంగా కాల్వ గట్లు..!

పాలకొల్లు ఎర్ర వంతెన సమీపంలో అపరిశుభ్రంగా ఉన్న కాలువ రేవు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని లారీ స్టాండ్, బ్రాడీపేట నుంచి ప్రభుత్వాసుపత్రి వరకూ రెండు కిలోమీటర్లకుపైగా ఉన్న కాలువ గట్టు రెండు వైపులా అపరిశుభ్రతకు మారుపేరుగా మారింది. అయినా మున్సిపాల్టీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో తాగునీటి కాలువ మురుగు కాలువగా మారింది. దీంతో పాలకొల్లు పరిసర ప్రాంతాల ప్రజలు మురుగునీరు తాగి రోగాలపాలవుతున్నారు. కాలువ అపరిశుభ్రత పాలకొల్లులోని ప్రయివేటు ఆసుపత్రులకు వరంగా మారింది. గతంలో ఆర్అండ్‌బి శాఖ లక్షల రూపాయలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అయితే ఫెన్సింగ్ పోయి సంవత్సరాలైనా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో బ్రాడీపేటలో కాలువ ప్రాంతాన్ని కారు పార్కింగ్, హోటల్స్ నిర్మాణం, చెత్త డంపింగ్ యార్డుగా మార్చేశారు. అయినా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోకపోవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

విషం తాగుతున్నాం..

పాలకొల్లు కాలువలోని మురుగునీరు దిగమర్రు ఛానల్ ద్వారా దిగమర్రు గ్రామానికి వెళ్లడంతో తమ గ్రామస్తులు విషం తాగుతున్నారని ఆ గ్రామ అధికార పార్టీ సర్పంచి కరుణాకర్ మండల సమావేశంలో వాపోయారు. రెండేళ్ల కిందట కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో సర్పంచి మొరపెట్టుకున్నారు. నేటికి ఆ సమస్య తీరలేదంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచులకు ఎంత గౌరవం ఇస్తున్నారో అర్థమవుతోంది. వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

బ్రాడీపేట వద్ద కాలువ పక్కన చెత్తా చెదారం

పేరుకుపోయిన చెత్తా చెదారం
నీరు కలుషితం, రోగాల బారిన ప్రజలు
పట్టించుకోని అధికారులు

తాగునీటి కాలుష్యాన్ని నివారించాలి

బాసిన శ్యామల, ఐద్వా పట్టణ కార్యదర్శి

పాలకొల్లు పట్టణంలో మున్సిపాల్టీ మురుగంతా ప్రధాన కాలువలోకి వెళ్తుంది. దీంతో గ్రామీణ మహిళలు కలుషిత నీటిని తాగి రోగాలపాలవుతున్నారు. అధికారులు మొద్దు నిద్ర వదిలి చర్యలు చేపట్టాలి.

కాల్వ గట్లను పరిశుభ్రంగా ఉంచాలి

పోలిశెట్టి లక్ష్మి దుర్గ, గృహిణి పాలకొల్లు

పాలకొల్లు కాలువ గట్లను మున్సిపాల్టీ వారు పరిశుభ్రంగా ఉంచాలి. అలాగే కాలువ రేవులను పరిశుభ్రంగా ఉంచాలి. శ్రావణ, కార్తీక మాసాల్లో మహిళలు ఎక్కువగా స్నానాలు చేస్తారు. తద్వారా స్వచ్ఛ భారత్ అమలు చేయాలి.

వల్లూరులో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ఓటర్ల సర్వే నూరుశాతం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - ఆచంట

వివాదాలకు తావులేకుండా ఇంటింటా ఓటర్ల జాబితా నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం వల్లూరు గ్రామ సచివాలయాన్ని, ఇంటింటా సర్వేను జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను ఆమె పరిశీలించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వారి ఓట్లు డిలీట్ చేశారా అని పరిశీలించి, చేర్పులు మార్పులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టరు స్వయంగా ఇంటింటి సర్వే పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో అధికారులు, బిఎల్ఒలతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని నూరు శాతం సర్వే పూర్తి చేయాలని తెలిపారు. బిఎల్ఒలు తమ వెంట వాలంటీర్లను గానీ మరి ఏ ఇతర వ్యక్తులను గానీ తీసుకెళ్లరాదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి రెండు శాతం కంటే ఎక్కువగాని ఉంటే తహశీల్దార్లు ఒకసారి పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నంబర్లో 10 మంది ఓటర్లు ఉంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించాలన్నారు. ఓటరు జాబితాను అత్యంత బాధ్యతగా తయారుచేసే పనిలో నిమగ్నమై ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, తహశీల్దార్ ఎస్‌వి. సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ వివిఎస్‌విఎల్.జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ, బిఎల్ఒలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని జిన్నూరు గ్రామంలో సచివాలయం-1ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయం పరిధిలో ఓటర్ సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది సోమవారానికి డోర్ టు డోర్ ఓటర్ సర్వే ప్రక్రియను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, డిప్యూటీ తహశీల్దార్ డి.రాజేష్, ఆర్ఐ కె.రాంబాబు, విఆర్ఒ బుజ్జి, సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు ఉన్నారు.

పాలకొల్లు రూరల్ : ఆదివారం మండలంలోని పూలపల్లి, భగ్గేశ్వరం గ్రామ సచివాలయాలను జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. గ్రామాల వారీగా ఇప్పటివరకూ అయిన పనితీరును అడిగి తెలుసుకుని, ఈ రోజు అర్ధరాత్రి అయినా పర్వాలేదు నూరుశాతం సర్వే పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు జాబితాలో తమ పేర్లు తొలగించారని ఎటువంటి ఫిర్యాదుకూ అవకాశం లేకుండా చేయాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వేపై బిఎల్ఒలు, నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులు ఈ నెల 21లోగా గడువు ఉన్నా, ఈ రోజు రాత్రికి పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వికలాంగులను పిడబ్ల్యూడి ఓటర్లుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రతి బిఎల్ఒ వద్దా బిఎల్ రిజిస్టర్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజు, డిప్యూటీ తహశీల్దార్ వి.బ్రహ్మాజీ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ డిమాండ్ - రాష్ట్రంలో వినాశకర విద్యా సంస్కరణలు : ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు తక్షణం చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ డిమాండ్ చేసింది. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం యుటిఎఫ్ మధ్యంతర జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభ సూచికగా ఎస్‌టిఎఫ్ పతాకాన్ని షేక్‌సాబ్జీ, యుటిఎఫ్ పతకాన్ని గోపీమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్‌సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో వినాశకరమైన విద్యా సంస్కరణలు అమలవుతున్నాయన్నారు. జిఒ 117 వల్ల ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అంటే పేద పిల్లలకు విద్య అందని ద్రాక్షగా మారి రాజ్యాంగ లక్ష్యాన్ని తుంగలోకి తొక్కుతున్నట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి మాట్లాడుతూ బదిలీలు, అలాట్‌మెంట్స్ జరిగిన ఉపాధ్యాయులకు మూడు నెలల నుంచి 20 శాతం మంది కూడా జీతాలు చెల్లించలేదని మండిపడ్డారు. రీ అలాట్‌మెంట్స్ జరిగి మూడు నెలలు గడుస్తున్నా మళ్లీ పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. వెంటనే 117 జిఒను రద్దు చేయడంతో పాటు సిపిఎస్‌ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలో యుటిఎఫ్, ఫ్యాప్టో ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 23న ఇబ్రహీంపట్నంలో పాఠశాల కమిషనర్ కార్యాలయం ముందు 12 గంటల పాటు ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకె.రామభద్రం మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ వెంటనే రూపొందించి ప్రమోషన్లు, బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ అకౌంట్స్ తెరిపించాలని, జిఒ నంబరు 84 వల్ల ఏర్పడిన సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, కె.శ్రీదేవి, జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శులు జె.కుమార్, ఏసుబాబు, క్రాంతికుమార్, రామకృష్ణంరాజు, కెఆర్‌కె.ప్రసాద్, శ్రీనుబాబు, రత్నం రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామానుజరావు, కృష్ణమోహన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ

ర్యాలీ నిర్వహిస్తున్న దళిత ఐక్యవేదిక నేతలు

మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయాలి

దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుందర్ కుమార్

ప్రజాశక్తి - పాలకోడేరు

మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై జరుగుతున్న హింసాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే అదుపు చేసి గిరిజన, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కుముదవల్లిలో కాల్మన్‌పేటలో దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరకుమార్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ సంఘటనపై రాష్ట్రపతి తక్షణం జోక్యం చేసుకుని, అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో పాలపర్తి జోన, సుందర్‌సింగ్, గల్లి సత్యానందం, యాకోబు, దొడ్డి, దానియేల్, ఆనంద్ కుమార్ మహిళలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

అభివృద్ధి పనులకు మంత్రి కొట్టు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని 19వ వార్డు భాగ్యలక్ష్మిపేట ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదివారం సాయంత్రం శంకుస్థాపనలు చేశారు. కల్కి టవర్స్ ఎదురుగా రూ.4.80 లక్షలతో నిర్మించనున్న పైపులైను, రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అలాగే పైబోయిన వెంకట రామయ్య వీధిలో ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో పైపు లైను నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటితోపాటు వంకా కృష్ణమోహన్ వీధిలో రూ.3,50,000 వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, దృశ్య కళల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, వార్డు ఇన్‌ఛార్జి సింగం సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజనీర్ డి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ పహారాలోనే వాండ్రం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాండ్రం గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న గొడవల నేపథ్యంలో గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు చేసి గ్రామాన్ని పోలీసుల పహారాలోనే ఉంచారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆదివారం ఉదయం నుంచి సుమారు నెలరోజుల వరకూ పైఅధికారుల ఆదేశానుసారం మళ్లీ ఉత్తర్వులు జారీ చేసే వరకు గ్రామంలో 144 సెక్షన్ ఉంటుందని తెలిపారు. కొత్తవారిని గ్రామంలోకి అనుమతించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపుగా లేకుండా చూసుకుంటున్నామని, గ్రామంలో శాంతిభద్రతలను కాపాడడమే లక్ష్యంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

దళిత కుటుంబాలను సుందర్ కుమార్ పరామర్శ

శుక్రవారం రాత్రి వాండ్రం గ్రామంలో జరిగిన ఆకతాయిల దాడుల నేపథ్యంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ ఆదివారం దళిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో కొంతమంది ఆకతాయిల అల్లర్లను అగ్రవర్ణాల వారు అలుసుగా తీసుకుని, ఎంతో పవిత్రమైన క్రైస్తవ ప్రార్థన మందిరం అద్దాలను పగలగొట్టడం దురదృష్టకరమని అన్నారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని, దళితులపై దాడి చేసిన వారిని విడిచి పెట్టేది లేదని వారికి తగు న్యాయం జరిగే వరకూ దళిత ఐక్యవేదిక తరపున వారికి అండగా ఉంటామని తెలిపారు. దాడి చేసిన అగ్రవర్ణాలపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దాడిలో గాయపడిన దళితులకు ప్రభుత్వం తరపున పరిహారం చెల్లించాలని వారు కోరారు. దళిత కుటుంబాలను పరామర్శించిన వారిలో పాలపర్తి జోన, ఉండి దళిత ఐక్య వేదిక మాజీ అధ్యక్షులు యాడంగి ఏసు ఉన్నారు.

పలువురిపై కేసు నమోదు..

వాండ్రంలో దళితవాడలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి అద్దాలు పగలగొట్టిన కొత్రకూటి రాజేష్, పురిగొల్పిన గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణపై చర్చి సంఘ పెద్దలు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొత్రకూటి రాజేష్, దాసరి వెంకటకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

పహారా కాస్తున్న పోలీస్ సిబ్బంది

కృష్ణవేణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహశీల్దార్

డిఆర్ఒ కృష్ణవేణికి సబ్‌కలెక్టర్ బాధ్యతలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం సబ్‌కలెక్టర్‌గా జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి పూర్తి అదనపు బాధ్యతలు ఆదివారం తన కార్యాలయంలో స్వీకరించారు. ఇటీవల సబ్‌కలెక్టర్ ఎం.సూర్య తేజ కెఆర్.పురం ఐటిడిఎ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో పూర్తిస్థాయి బాధ్యతలను కృష్ణవేణి స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

22న పిల్లల ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల్లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జి హాస్పిటల్స్, మానవత వైద్య సహాయం అందిస్తాయన్నారు. మరింత సమాచారం కోసం 99490 93115, 9440859700, 6300180993, 9494338086 సంప్రదించాలన్నారు.

వంతెన నిర్మాణం అభినందనీయం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

చినపుల్లేరు గ్రామంలోని బొండాడ కాల్వపై రైతుల సహకారంతో సుమారు రూ.పది లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ గ్రామంలోని రైతుల సహకారంతో వంతెన నిర్మించడం అభినందనీయమన్నారు. దీంతో కాలువ అవతల ఉన్న పొలాలకు వెళ్లడానికి సులభతరం అవుతుందన్నారు. ఇప్పటివరకూ చాలా దూరం ప్రయాణించి కాల్వ అవతలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, నేటి నుంచి అటువంటి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి లేదని చినపుల్లేరు గ్రామస్తులు ఈ వంతెనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ, రామరాజు, కాళ్ల జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రైతులు బొర్రా వెంకన్న, అల్లూరి చంద్ర రాజు, బొర్రా ఆంజనేయులు, బొర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

వంతెన ప్రారంభోత్సవంలో పాల్గొన్న పివిఎల్

22న యుపిఎ ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - పాలకోడేరు

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ ఈ నెల 22వ తేదీ మంగళవారం మూడు గంటలకు యుపిఎ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను గొరగనమూడి సెయింట్ జోసెఫ్ లూథరన్ చర్చి వద్ద ఆదివారం ఆవిష్కరించారు. గొల్లలకోడేరు ప్రాంతం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ తెలిపారు. యుపిఎ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి సంఘాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ నికోలాస్ సంఘం పెద్దలు ఎం.రాజేష్, తులసి, చంద్రమోహన్, గోడి రమేష్‌బాబు, పితాని పద్మనాభం, గంటా చిన్నజయ పాల్గొన్నారు.

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర, ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

22న ప్రపంచ జానపద దినోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన స్థానిక బివిఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జానపద కళోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభిషేక్‌ను అభినందిస్తున్న గుడాల గోపి

డిఎస్‌పి అభిషేక్‌కు గుడాల గోపి అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

సీనియర్ అడ్వకేట్ రావూరి చాచా కుమారుడు రావూరి అభిషేక్ గ్రూపు-1లో ర్యాంకు సాధించి డిఎస్‌పిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అభిషేక్‌ను వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి ఆదివారం అభినందించారు. సివిల్స్‌లో కూడా మంచి ర్యాంకు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఆయనతో పాటు మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జిల్లా యూత్ అధ్యక్షుడు విన్‌స్టన్ బాబు, పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పాలంకి శ్రీను, చినిమిల్లి గణపతి, గవర బుజ్జి, జోగడ ఉమమహేశ్వరరావు, మద్ద చంద్రకళ, లీల భగవాన్ పాల్గొన్నారు.

పాలకొల్లుకు చెందిన అభిషేక్ డిఎస్‌పిగా ఎంపిక కావడం వారి కుటుంబానికే కాకుండా పాలకొల్లుకు గర్వకారణమని వైసిపి నేత గుణ్ణం నాగబాబు చెప్పారు. అభిషేక్‌ను ఆదివారం అచ్చుగట్లపాలెం, బొర్రావారి లే అవుట్ ప్రాంతీయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పాల కొల్లు నుంచి ఐపిఎస్ అయ్యే మొదటి అధికారి అభిషేక్ అని చెప్పారు. అభిషేక్ తల్లి దండ్రులు చాచా, శ్రీదేవిలను సభికులు ఘనంగా అభినందించారు. జనసేన నేత చేగొండి సూర్య ప్రకాష్, పాలకొల్లు జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు, పట్ట ణ ప్రముఖులు తటవర్తి కృష్ణమూర్తి, వంగా నరసింహారావు, అడ్డాల వాసు, గాదె ఆంజనేయులు, చినిమిల్లి గణపతి, పశ్యావుల రవికుమార్, జక్కంపూడి మదన్, టౌన్ హాల్, యునైటెడ్ కాపు క్లబ్, అడ్వకేట్లు, పలు సంఘాల నేతలు అభిషేక్‌ను ఘనంగా సత్కరించారు.

22న సిపిఐ బహిరంగ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్ర ఈ నెల 22వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా తణుకులో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు పిలుపునిచ్చారు. స్థానిక వంకా సత్యనారాయణ స్వరాజ్య భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు సిపిఐ జాతీయ రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు సిక్కిలే పుష్పకుమారి, తణుకు ఏరియా కన్వీనర్ అప్పలస్వామి పాల్గొన్నారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - -కాళ్ల

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి తిరిగి అధికారం చేపట్టాలని టిడిపి బిసి సాధికారత సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన కాళ్లలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తోట ఫణిబాబు, బండారు వేణుగోపాలరావు, మహాశక్తి టీమ్ మెంబెర్స్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ :మండలంలోని అరట్లకట్ట గ్రామంలో మహాశక్తి కార్యక్రమం మండల మహిళా అధ్యక్షురాలు ద్రాక్ష జ్యోతి, పీతల జాన్సీరాణి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో మహాశక్తి, తల్లికి వందనం, పిల్లలు చదువుకుంటున్న వారందరికీ ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి నెలా 18 ఏళ్ల నుంచి 59 వయస్సు గల మహిళలందరికీ ఒక్కొకరికి రూ.1,500, ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిల్లిండర్లు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల విజయకుమారి, గూడాల సత్యవాణి, తమ్మ లక్ష్మి, బండారు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : మండలంలోని వేములదీవి తూర్పు గ్రామంలో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మహిళలకు ఇస్తున్న పథకాల గురించి ఇంటింటికి తిరుగుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో అందే రామకృష్ణ, నల్లూరి సూర్యనారాయణ, శంకరపు వెంకటేశ్వర్లు, కొట్టు సత్యనారాయణ, వడ్డీ ముక్తేశ్వరరావు, తిరుమని తాతయ్య, మల్లాడి నరసింహస్వామి, మురాల ఏడుకొండలు, తిరుమణి రాధాకృష్ణ, సిరిగినీడి రాజ్యలక్ష్మి, కొలచన పద్మ, తిరుమాని శశిదేవి, బస్వాని నాగమణి, కనకదుర్గ రామలక్ష్మి, రమేష్, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి ముఠా అరెస్టు

రూ.90 వేల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని బల్లిపాడులో గంజాయి కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను పాలకొల్లు రూరల్ ఎస్ఐ తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.90 వేల విలువైన 30 కేజీల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెలఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్లో ఎస్‌పి యు.రవిప్రకాష్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బల్లిపాడు రైల్వేట్రాక్ వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి కలిగి ఉన్నారని సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో గంజాయి కలిగి ఉన్న యలమంచిలి మండలం మేడపాడు గ్రామానికి చెందిన బండి కిరణ్, తణుకుకు చెందిన అత్తిలి వంశీ ఫణీంద్ర, ఇరగవరం కాలనీకి చెందిన మహమ్మద్ సాదిక్, రావులపాలేనికి చెందిన వెంద్రపాటి అనిల్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 30 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.90 ఉంటుందని ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. గంజాయితో పాటు వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నరసాపురం డిఎస్‌పి కె.మనోహరాచారి, ఇన్‌ఛార్జి సిఐ డి.రాంబాబు, పాలకొల్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడ గ్రామంలోని రాజుపేట వంతెన వద్ద గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతునికి సుమారు 40 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, కాలువలో కొట్టుకొచ్చినట్లు స్థానికులు చెరుకువాడ విఆర్ఒ వెంకట దుర్గాప్రసాద్‌కు తెలిపారు. విఆర్ఒ వెంకట దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

భార్యను చంపిన రాంబాబును బహిరంగంగా ఉరి తీయాలి

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఆకివీడు జాతీయ రహదారిపై కొవ్వొత్తుల ప్రదర్శనతో మానవహారం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రేమ పేరుతో మోసం చేసిన మానవ మృగం వాడపల్లి రాంబాబును బహిరంగంగా ఉరి తీయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఆకివీడులో జరిగిన సంధ్యారాణి హత్యపై పలు సంస్థలు, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డోకల రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత దుంపగడప రోడ్డులోని బాధితుల నివాసం దగ్గర నుంచి రైల్వే గేటు, రైల్వే స్టేషన్ రోడ్డు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలు గుండా ర్యాలీగా దొరగారిచెరువు గట్టు వద్దకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి అక్కడ జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఛైర్ పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. సంధ్యారాణిని హత్య చేసిన రాంబాబును ఉరి తీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందన్నారు. ఐద్వా నాయకురాలు సందక ఉదయకుమారి మాట్లాడుతూ సగటు మహిళకు భయం కల్పించే ఈ చర్యలను యావత్ లోకం ఖండించాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, సందక సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు బి.వర్మ, గేదెల రాము, వైసిపి నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గేదెల లావణ్య, సందక సూరిబాబు, బొడ్డుపల్లి రాంబాబు, గేదల ధనుష్, జి.రాంబాబు, ఆర్యవైశ్య సంఘ నాయకులు వినోద్‌కుమార్, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ (పండు), వైసిపి నాయకురాలు మొర జ్యోతి పాల్గొన్నారు.

కుటుంబానికి అన్నీ తానై..!

యల్లమిల్లి కుటుంబం అభ్యున్నతికి సత్యవతి ఎనలేని కృషి

తాను చదువుకోకపోయినా విద్యపై ఎంతో మక్కువ

నరసింహమూర్తి బాటలోనే సతీమణి సత్యవతి



నరసింహమూర్తి, సత్యవతి దంపతులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆమె నిరక్షరాసురాలు.. ఏమి చదువుకోలేదు.. కనీసం ఆమెకు సంతకం కూడా చేయడం రాదు. అయినా విద్యపై ఎంతో మక్కువతో కుటుంబాన్ని విద్యలో అభివృద్ధి చేసి కుటుంబ సభ్యులను వివిధ ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగాల్లో నిలిపేందుకు అన్ని తానై ఆడది అబల కాదు సబల అని మరోసారి నిరూపించారు. ఆమె మరెవరో కాదు రిటైర్డ్ ఉపాధ్యాయులు, నటుడు, అభ్యుదయవాది వేంద్ర గ్రామానికి చెందిన యల్లమిల్లి నరసింహమూర్తి సతీమణి యల్లమిల్లి సత్యవతి. ఇటీవల సత్యవతి (77) అనారోగ్యంతో మృతి చెందారు. ఐదు నెలల క్రితం నరసింహమూర్తి మృతి చెందారు. అప్పటినుంచి భార్య సత్యవతి మనస్తాపానికి లోనై అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందారు. గణపవరం మండలంలోని దేవర గోపవరం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి వెంకన్న, సుబ్బమ్మ దంపతుల కుమార్తె సత్యవతిని నరసింహమూర్తి వివాహం చేసుకున్నారు. నరసింహమూర్తి ఉపాధ్యాయునిగా, యుటిఎఫ్ నేతగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుండి, సిపిఎం నాయకునిగా కార్మికులకు అండగా ఉండి, గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కార మార్గం చూపుతూ కళాకారుడిగా సమాజానికి అనేక సేవలందించారు. సత్యవతి కూడా భర్త నరసింహమూర్తి బాటలోనే నడిచారు. ఉపాధ్యాయునిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు, సమాజ రుగ్మతలకు వ్యతిరేకంగా సమాజానికి నరసింహమూర్తి సేవలందిస్తే సత్యవతి కుటుంబాన్ని చక్కబెట్టి, అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించేవారు.

నరసింహమూర్తి దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అచ్యుత సూర్య సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణమూర్తి (వైఎస్ఎన్.మూర్తి), సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి ఉన్నారు. అయితే సత్యవతి నిరక్షరాసులు అయినప్పటికీ ఒకపక్క విద్యపై మక్కువ మరోపక్క కుటుంబాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగేవారు. వీరిని ఉన్నత చదువులు చదివించి. భవిష్యత్తుకు బంగారు బాట వేయడంలో నరసింహమూర్తిలో సగ భాగమై సత్యవతి కుటుంబానికి అన్ని తానే కుటుంబాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది. ఈ ఐదుగురు సంతానం, వీరి కుమారులు, కుమార్తెలు కూడా విద్యలో అన్ని విధాలుగా అభివృద్ధి చెంది వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల్లో ఉన్నారంటే వారు చేసిన కృషి ఫలితమే. అన్ని విషయాల్లో నరసింహమూర్తి బాటలోనే సత్యవతి నడుస్తూ ఉండేవారు. గ్రామంలో మహిళలకు చేదోడు వాదోడుగా ఉంటూ అనేక సూచనలు, సలహాలు అందించేవారు. ముఖ్యంగా శుభకార్యాలకు సత్యవతికి గ్రామస్తులు మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారు. అనునిత్యం నరసింహమూర్తికి తోడుగా ఉంటూ కుటుంబాన్ని అన్నివిధాలా ఆమె ముందుకు నడిపించిన తీరు ఎంతోమందికి ఆదర్శమని చెప్పొచ్చు. అయితే ఐదు నెలల కాలంలోనే కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తల్లితండ్రులు కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని సగంచెరువు, గోరెంటాడ, ఆగర్రు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సాధికార మిత్ర, సేవా మిత్రా, తెలుగు యువత ఐటిడిపి సభ్యులతో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం పార్టీ బలోపేతానికి చేయాల్సిన, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కోడి విజయభాస్కర్, యూనిట్ ఇన్‌ఛార్జి సహదేవుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు మల్లుల రవీంద్ర కుమార్, యువత అధ్యక్షులు నీలం తాతాజీ, కొండేటి నరేష్ పాల్గొన్నారు.

సాంప్రదాయాలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో ప్రతిఒక్కరూ సాంప్రదాయాలు కాపాడుకోవాలని వైసిపి రాష్ట్ర యువత నాయకులు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం నిర్వహించిన మావుళ్లమ్మ జాతరను రవితేజ ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో భక్తుల ఇలవేల్పు మావుళ్లమ్మ జాతరను పట్టణంలో వాడవాడలా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి కరుకు పోతురాజు, బూది శ్రీను, మోది అప్పారావు, అమ్మాణి కృష్ణ, కరుకు ఏడుకొండలు, కొక్కురి గురుమూర్తి, లీల, మద్దాల సత్యనారాయణ, అడబాల పవన్ పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా అబ్బిరాజుపాలెం మెగా పవర్ యూత్ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి వారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 22వ తేదీన మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా దక్షిణ తిరుమలగా పిలువబడే అబ్బిరాజుపాలెం గ్రామంలో రాష్ట్రంలోనే ఎత్తయిన రెండో 99 అడుగుల అభయాంజనేయస్వామి వారి ఆలయంలో, వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో చిరంజీవి ఆత్మీయుడు రజనీకాంత్ అభిమానితో కేక్ కట్ చేయించినట్లు తెలిపారు. అబ్బిరాజుపాలెం చిరు యూత్ ఎన్నో సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి అంజనీకుమార్, ప్రసాద్, పాలూరి హనుమంతు, ప్రసాద్, ప్రసాద్, సత్తిబాబు, మెగా పవర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కడకట్లలోని జనతా ఛారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో పూర్వ అధ్యక్షులు సన్నిధి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన నిడదవోలు రాజేశ్వరి నేత్ర వైద్యశాల వైద్యులతో ఆదివారం కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ గవర్నర్ పదం కుమార్ గుప్త ఆర్థిక సహకారంతో 103 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం 13 మందిని నిడదవోలుకు పంపించారు. 22 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా చైర్‌పర్సన్ పచ్చా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడుతూ ఇంకా మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడ గ్రామానికి చెందిన కొండవీటి శ్రీనివాస్ కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు సంస్థ అధ్యక్షులు కట్రెడ్డి తాండవ నాగ సత్యనారాయణ, సభ్యులు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మాజీ అధ్యక్షులు, అర్తమూరు కలిసిపూడి గ్రామాల సమాఖ్య ఎంపిటిసి సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కొండవీటి శ్రీనివాస్ పక్షవాతంతో బాధపడుతున్నారన్నారు. పలుమార్లు వికలాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసినప్పటికీ పెన్షన్ రాలేదన్నారు. రోజు గడిచే పరిస్థితి లేక శ్రీనివాస్ ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి రాగానే సంస్థ సభ్యుల సహకారంతో తన వంతు బాధ్యతగా నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించినట్లు రామలింగేశ్వరరావు తెలిపారు. ప్రతిఒక్కరూ స్పందించి ఇటువంటి బాధితులను ఆదుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని రామలింగేశ్వరరావు సూచించారు. ప్రభుత్వం స్పందించి పక్షవాతంతో బాధపడుతున్న కొండవీటి శ్రీనివాస్‌ను ఆదుకుని పింఛన్ ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పిఆర్‌కె.రాజు, కాగిత సోమేశ్వరరావు, బీడెల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధితునికి నిత్యావసరాలు అందిసుతన్న మానవత సభ్యులు

దోమల నిర్మూలనపై అవగాహన అవసరం

ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు యాగార్లపల్లి, కదకట్ల, ఎన్‌టిఆర్ జంక్షన్, వీకర్స్ కాలనీల్లో వైద్యాధికారులు డాక్టర్ ఆశాలత, డాక్టర్ చైతన్య ,డాక్టర్ అమృత, డాక్టర్ శ్రావ్య అధ్యక్షతన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు మాట్లాడుతూ మగ దోమలు కుట్టడం వల్ల వ్యాధులు రావని, ఆడ దోమల వల్ల మలేరియా, డెంగీ తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ దోమల నిర్మూలనకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గృహం వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, వాలంటీర్లు, ఆరోగ్య సహాయకులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మార్నిడి బాబ్జి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం కోతి బొమ్మ సెంటర్ రోడ్డులో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బాలబొమ్మల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చరితార్థుడని బాలబొమ్మల శ్రీనివాస్ కొనియాడారు. భారతదేశ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ చూపిన చొరవ, సాంకేతిక అంశాలు యువత మరువదన్నారు. రాజీవ్ గాంధీ బతికుంటే దేశం ఎంతో అభివృద్ధి సాధించేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు

పాలకొల్లు : మాజీ ప్రధాని, భారతరత్న, కీర్తిశేషులు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పాలకొల్లు పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి, మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గ కొలుకులూరి అర్జున్‌రావు, కాంగ్రెస్ నాయకులు బోనం వెంకట్రావు, వై.నామగిరి, బొలిశెట్టి భానుప్రకాష్, ఎం.భద్రం, టి.వీరన్న, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

ప్రకటన

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం. 55/2022
ఓ.ఎస్.నెం. 60/2009

బిట్వీన్:

డి. హెచ్.ఆర్ /వాది: విప్పర్తి ప్రభాకరరావు
అండ్

జె.డి.ఆర్ /ప్రతివాది:
పీతల చిన నరసింహమూర్తి వగైరాలు

2వ జె.డి.ఆర్: సోడగిరి భీముడు, తండ్రి: పుల్లయ్య, 63 సం॥లు, హిందు, పురుషుడు, సా॥ మార్టేరు, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.

పై నెంబరు వారంటు గ్రంధమునందు తమకోర్టు అమీనా గారి ద్వారా ప్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్థియందు Eneroachments తొలగించి 1, 2 జె.డి.ఆర్స్ ప్లయింటు షెడ్యూలు తప్పించి వాది /డి.హెచ్.ఆర్.కు Vacent Possession ఇప్పించమని దాఖలు చేసిన వారంటు గ్రంధమునందు కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 2వ జె.డి.ఆర్. అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అమలు జరగని కారణముగా పేపరు ప్రకటన ద్వారా అమలు జరుగు నిమిత్తం ది. **12-09-2023 సం॥రం తేదీనకు వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను.** లేనిఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్యామ్‌సన్ మెరిపో
తణుకు, అడ్వకేట్, తణుకు.
16-8-23. సెల్: 99499 90988

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: TADEPALLIGUDEM
F.D.I.A.No.5/2023
in O.S.No.399/2014

Between:
Posimsetti Krishna
...Petitioner /Plaintiff
Vs
Vanapalli Tirupathi Rayudu
...Respondent /Defendant

In the above matter the Honourable court order on 03-08-2023 to publish in the new paper for sale of the below schedule property for recover of the mortgage debt in the premises of the Honourable court to be held on 05-09-2023. So, please take notice that the Honourable court conduct auction for sale of below schedule property on 05-09-2023 at 10:30 AM in the premises of the Honourable Senior Civil Judge Court, Tadepalligudem, if any one willing to participate in the auction please attend before the **Honourable Court at 10:30 A.M on 05-09-2023** and know the terms and conditions of the auction and participate in the auction.

SCHEDULE

West Godavari District, Bhimavaram District Registrar, Attilli Sub-registry, Ganapavaram Mandalam, S.Kondepadu village, Dry land, R.S.No.133/4 full extent of Ac.1-82cents in which as per sub division present R.S.No.133/4A an extent of Ac.0-89 cents and in R.S.No.133/4B full extent of Ac.0-02cents and R.S.No.135/3 full extent Ac.1-76 cents in which as per sub division present R.S.No.135/3B full extent Ac.0-46 cents in which Ac.0-25 cents the land in all the Three R.S.No's consisting in to single plot in a total extent of Ac.1-16 cents in which the Southern extent of Ac.0-58 cents of land is bounded by:

East: Gedela Kodugattu. ***South:*** Land of Vanapalli Venkata Subba Rao. ***West:*** Land of Yalamanchali Chinnayya. ***North:*** Land of Vanapalli Tirupathi Rayudu i.e., the defendant.

With in the above boundaries an extent of Ac.0-58 cents of land with all easementery right there in.

Value of the Petitioner: Rs.4,00,000/-
Amin Value:

K.MANI KUMAR
Advocate for Petitioner
Tadepalligudem, Tadepalligudem
20-8-23. Phone: 08818-244620

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: TADEPALLIGUDEM
F.D.I.A.No.6/2023
in O.S.No.398/2014

Between:
Posimsetti Ram Murthy
...Petitioner /Plaintiff
Vs
Vanapalli Tirupathi Rayudu
...Respondent /Defendant

In the above matter the Honourable court order on 03-08-2023 to publish in the new paper for sale of the below schedule property for recover of the mortgage debt in the premises of the Honourable court to be held on 05-09-2023. So, please take notice that the Honourable court conduct auction for sale of below schedule property on 05-09-2023 at 10:30 AM in the premises of the Honourable Senior Civil Judge Court, Tadepalligudem, if any one willing to participate in the auction please attend before the **Honourable Court at 10:30 A.M on 05-09-2023** and know the terms and conditions of the auction and participate in the auction.

SCHEDULE

West Godavari District, Bhimavaram Sub-Registrar, Attilli Sub-Division, Ganapavaram Mandalam, S.Kondepadu village, Wet land, R.S.No.133/4 full extent of Ac.1-82cents in which as per sub division present R.S.No.133/4A an extent of Ac.0-89 cents and in R.S.No.133/4B full extent of Ac.0-02cents and R.S.No.135/3 full extent Ac.1-76 cents in which as per sub division present R.S.No.135/3B full extent of Ac.0-25 cents the land in all the Three R.S.No's consisting in to single plot in a total extent of Ac.1-16 cents in which the Northern extent of Ac.0-58 cents of land is bounded by:

East: Gedela Kodugattu. ***South:*** Land of Vanapalli Tirupathi Rayudu i.e., the defendant. ***West:*** Land of Yalamanchali Chinnayya. ***North:*** Land of Vanapalli Peda Satyam.

With in the above boundaries an extent of Ac.0-58 cents of land with all easementery right there in.

Value of the Petitioner: Rs.4,00,000/-
Amin Value:

K.MANI KUMAR
Advocate for Petitioner
Tadepalligudem, Tadepalligudem
20-8-23. Phone: 08818-244620